ప్రజలగుండెల్లో నిలిచిన మహనీయుడు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని జిల్లా వ్యాప్తంగా శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో వైఎస్సార్ చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలతో అభివృద్ధి జరిగిందని, ప్రజల గుండెల్లో నిలిచిన మహనీయుడు వైఎస్సార్ అని ఆయన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం: నివాళులర్పిస్తున్న నాయకులు



కురవిలో..



తొర్రూరులో..



మరిపెడలో..



మహబూబాబాద్ రూరల్: వైఎస్సార్ టీపీ ఆధ్వర్యంలో..



గూడూరు: గుండెంగలో..



బయ్యారంలో..



గార్లలో..

టేకు చెట్ల నరికివేతపై ఆందోళన

తొర్రూరు: పట్టా భూమిలో విలువైన టేకు చెట్లను అన్యాయంగా నరికి వేశారని బాధితులు ఆందోళన చేపట్టిన ఘటన శనివారం డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో 229 సర్వే నంబర్‌లో కిన్నెర యాకయ్యకు చెందిన 1.20 ఎకరాల భూమిలో కొన్నేళ్ల క్రితం 100 మేర టేకు మొక్కలు నాటారు. అవి ప్రస్తుతం ఏపుగా ఎదిగాయి. దానిలో 40 మొక్కలు పట్టణానికి చెందిన పలువురు నరికారని తమకు అనుమానం ఉందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు నరికిన టేకు దుంగలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ ఘటనపై బాధితులకు న్యాయం జరగాలని ఆలిండియా బేడ బుడగ జంగాల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు తూర్పాటి పాండు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బాధితులు కిన్నెర సమ్మక్క, శ్రీనివాస్, సమ్మయ్య, బేడబుడగ జంగాల సంఘ నాయకులు పాల్గొన్నారు.



నరికేసిన చెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

మన జాతి గౌరవాన్ని కాపాడుతున్నా..

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి: 'మా తండాలో మారాజ్యం కోసం పోరాడారు.. తండాలను గ్రామ పంచాయతీలను చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకుని తండాలను, గూడాలను గ్రామ పంచాయతీలుగా చేశారు.. 'మన లంబాడీ జాతి గౌరవాన్ని కాపాడుతున్నా ''నని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. సీరోలు మండలం ఉప్పరిగూడెం, గోప తండా, తాళ్లసంకీస, వస్రాం తండాల్లో శనివారం మూడవ రోజు ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ నాటికి రైతులకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఎస్సీలకు 50 గృహాలు ఇస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీ, కాలం తిరుపతిరెడ్డి, ఎంపీపీ పద్మావతిరవినాయక్, ఆర్‌బీఎస్ కోఆర్డినేటర్ రమేష్, సొసైటీ చైర్మన్‌లు వెంకటరెడ్డి, శ్రీదేవి, గోవర్ధన్‌రెడ్డి, నాయకులు తోటలాలయ్య, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పదేళ్లుగా మీవెంట ఉన్నాం.. ఏం చేశారు?

కురవి: పదేళ్లుగా మీ వెంట ఉన్నాం.. మాకు ఏం చేశారు? మాకు గత ప్రభుత్వం ఇచ్చిన భూములు లాక్కున్నారు, ఇళ్లు ఇవ్వలేదని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌ను మహిళలు ప్రశ్నించారు. శనివారం సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభ అనంతరం బయటకు వస్తుండగా ఎమ్మెల్యేను మహిళలు ప్రశ్నించారు. మాకు ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన భూమిలో గోదాం నిర్మాణం, పల్లె ప్రకృతి వనం, క్రీడా మైదానం చేపడుతున్నారని ఎమ్మెల్యేకు చెప్పారు. ఇచ్చిన స్థలాలను గుంజుకోవడం తగదన్నారు. పోలీసులు అడ్డుకున్నా.. మహిళలను ఎమ్మెల్యేతో వారించారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

యువకులు సన్మార్గంలో నడవాలి

గార్ల: మూఢనమ్మకాల నుంచి ప్రజలను చైతన్య పర్చేందుకే గ్రామాల్లో పోలీస్ కళాజాతా బృందంచే కళా ప్రదర్శనలు, మ్యాజిక్‌షోలు ప్రదర్శిస్తున్నట్లు ఎస్సై బానోత్ వెంకన్న అన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో జిల్లా పోలీసుల కళాబృందం కళాజాతా ప్రదర్శన కార్యక్రమాన్ని సర్పంచ్ బి.భారతి, ఎంపీటీసీ రాజకుమారిలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువకులు చెడు వ్యసనాలకు మానుకొని, సన్మార్గంలో పయనించినప్పుడే అన్నిరంగాల్లో రాణిస్తారని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై రవీందర్, కానిస్టేబుళ్లు శ్రీను, మంగీలాల్, హోంగార్డు రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై వెంకన్న

విద్యాభివృద్ధికి పాటుపడాలి

గూడూరు: మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో కర్తవ్య దీక్షతో విధులు నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి పాటుపడాలని డీఈఓ రామారావు అన్నారు. గూడూరు మండలం యూపీఎస్ అప్పరాజ్‌పల్లి, పీఎస్ జగన్నాయకులగూడెం పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టికతో పాటు, విద్యార్థుల నమోదు రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాలను, మౌలిక వసతులను, నూతనంగా నిర్మిస్తున్న తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ చంద్రశేఖర్ ఆజాద్, హెచ్‌ఎంలు భీముడు, ఎస్సీ హసీనా పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని డీఈఓ పి.రామారావు శనివారం తెలిపారు. ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 10, 11 పిల్లలతో పుస్తక పఠనం యొక్క ఆవశ్యకత, 12, 13న పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు సేకరించే కార్యక్రమం, ఈనెల 14న విద్యార్థులతో పేపర్ కటింగ్స్, పజిల్స్ రీడింగ్ కార్డ్స్, అభ్యసన సామగ్రి తయారు, ఈనెల 15న తల్లిదండ్రుల సమావేశంలో పిల్లలతో పుస్తక పఠనం పోటీలు నిర్వహించాలన్నారు.

పార్టీని నష్టపరిచేలా వ్యవహరిస్తే చర్యలు



మాట్లాడుతున్న నాయకులు

కేసముద్రం: పార్టీలో కొంతమంది వ్యక్తులు గ్రూపులను ప్రోత్సహిస్తూ పార్టీకి నష్టం జరిగేలా వ్యవహరిస్తున్నారని, అలాంటివారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎండి.నజీర్ అహ్మద్, ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మూడోసారి పోటీచేయడానికి సిద్ధంగా ఉన్నాడన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక కొందరు వ్యక్తులు పార్టీలో గ్రూపులను ప్రోత్సహిస్తూ, పార్టీవిచ్ఛిన్నం చేసేలా ప్రకటనలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వీరునాయక్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు వెంకన్న, సోమన్న పాల్గొన్నారు.

ఆరోపణలు చేయడం సరికాదు

నెల్లికుదురు: మహబూబాబాద్ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై నిరాధారమైన ఆరోపణలు నమ్మవద్దని ఏఎంసీ వైస్ చైర్మన్ కసరబోయిన విజయ్ యాదవ్ అన్నారు.

పాత పెన్షన్ విధానం అమలుకు పోరాటం

తొర్రూరు: పాత పెన్షన్ విధానం అమలు కోసం ఉపాధ్యాయ లోకం అలుపెరగని పోరాటం చేస్తుందని రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి గోపు లక్ష్మీకాంత్ అన్నారు. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్లను శనివారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు నాగిరెడ్డి, నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం బీవీరావు, నాయకులు సోమిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కురవి: పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్ పోస్టర్లను సంఘం నాయకులు మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు శివప్రసాద్, భాస్కర్, రవికుమార్ పాల్గొన్నారు.

కేసముద్రం: పాతపెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్‌పోస్టర్‌లను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవన్‌లో సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవిచంద్ర, రవి, లక్ష్మీకాంత్, రవీందర్, యాదగిరి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

గార్ల: సీపీఎస్ పెన్షన్ స్కీం మండల నూతన కమిటీని శనివారం గార్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా బాదావత్ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ప్రసాదరావులతో పాటు మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఈనెల 16నుంచి ప్రారంభం కానున్న పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఈనెల 20న జిల్లాకు రానుందన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

చిన్నగూడూరు: మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక కోసం మండల స్థాయి క్రీడా పోటీలను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించినట్లు హెచ్‌ఎం రెహమాన్, పీఈటీ పుష్పలీల తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో 6గురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 12న జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ అవారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు నాగార్జున్, రేణుకాదేవి, లలిత తదితరులు ఉన్నారు.

కొత్తగూడ: హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు మండల కేంద్రంలోని క్రీడా పాఠశాలలో శనివారం ఎంపిక పోటీలు నిర్వహించారు.

పాఠశాలలో విద్యార్థుల బోనాల వేడుకలు



కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో శనివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేషధారణలో విద్యార్థులు నృత్యాలు చేస్తూ అందరిని అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిత్రయాకాంతంగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోదీని కలిసిన ఎంపీటీసీ



నెల్లికుదురు: మండలంలోని రత్తిరాం తండా ఎంపీటీసీ సభ్యుడు, యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు మదన్ శనివారం మామునూరు ఎయిర్ పోర్టు వద్ద ప్రధాని నరేంద్ర మోదీని కలిశాడు.

ప్రిన్సిపాల్‌గా సదానందం



మహబూబాబాద్ అర్బన్: మానుకోట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పొక్కుల సదానందం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం నెల్లికుదురులో ప్రభుత్వ జూనియర్ కళాశాల విధులను నిర్వర్తిస్తున్న పొక్కుల సదానందం బదిలీపై మానుకోటకు వచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంఘం జిల్లా కార్యదర్శి నాయిని వీరేందర్, నారాయణ, నాగేందర్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం

డోర్నకల్: స్థానిక సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో శనివారం డోర్నకల్, కురవి, గార్ల లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార వేడుకలు ఘనంగా జరిగాయి. డోర్నకల్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా లయన్ ఆంటోని పసాల, కార్యదర్శిగా బి.శ్రీనివాసరావు, కోశాధికారిగా కాపరబోయిన యుగేందర్ ప్రమాణస్వీకారం చేశారు. గార్ల అధ్యక్షుడిగా విజయ్, సెక్రటరీగా విమల్‌జైన్, కోశాధికారిగా జి.లక్ష్మణ్‌నాయక్, కురవి అధ్యక్షుడిగా మాదవరావు, కార్యదర్శిగా డాక్టర్ కె.నాగేందర్, కోశాధికారిగా జి.రాంచంద్రయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ పరుశరాములు, చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మినర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన నాయకులు

మహబూబాబాద్ అర్బన్/గూడూరు/దంతాలపల్లి: హనుమకొండలో శనివారం పీఎం నరేంద్రమోదీ బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు బస్సులు, కారుల్లో పార్టీ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు.

మూడోరోజు కొనసాగిన దీక్ష

సాక్షి నెట్‌వర్క్: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె శనివారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. దీక్షకు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

పెట్రోల్ బాటిల్‌తో థర్డ్ జెండర్ హల్‌చల్

మరిపెడ/మరిపెడ రూరల్: మరిపెడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట స్థానిక మున్సిపాలిటీకి చెందిన థర్డ్ జెండర్ భూక్యా సంజన అలియాస్ రాజేష్ శనివారం హల్‌చల్ చేశాడు. మండల పరిధిలోని 72 మంది థర్డ్ జెండర్లకు డబుల్ బెడ్రూం ఇళ్లతోపాటు 'దళిత బంధు' పథకం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ.. వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగాడు. విషయం తెలుసుకున్న అదనపు ఎస్సై మొగిళి సిబ్బందితో చేరుకుని సంజనతో మాట్లాడే ప్రయత్నం చేశాడు. అయినా వినకుండా ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో అప్రమత్తమైన పోలీసులు, అక్కడే ఉన్న ఫైర్ స్టేషన్ సిబ్బంది నిలువరించారు. ఫైర్‌స్టేషన్ నుంచి బకెట్లో తెచ్చి ఉంచిన నీటిని అతడిపై పోశారు. రెండో శనివారం సెలవు కావడంతో తహసీల్దార్ కార్యాలయం తెరుచుకోలేదని, సోమవారం వచ్చి అధికారులకు డిమాండ్లను విన్నవించాలని ఎస్సై సూచించడంతో సంజన ఆందోళనను విరమించి వెళ్లిపోయాడు.

సంక్షిప్త సమాచారం

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

బయ్యారం: బయ్యారంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్ మాట్లాడుతూ.. పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం సరిగా లేదన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా వండించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కళ్యాణ్, ప్రదీప్, రాజేష్, హిమంత్, జగన్, ప్రణయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజల కష్టాలు తీరుతాయి

బయ్యారం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావడం ద్వారానే ప్రజల కష్టాలు తీరుతాయని పార్టీ నియోజకవర్గ నాయకుడు రవి అన్నారు. శనివారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారామయ్య, నాయకులు పాల్గొన్నారు.

హరీశ్‌గౌడ్‌కు డాక్టరేట్



గూడూరు: మండల కేంద్రానికి చెందిన తండ హరీశ్‌గౌడ్ అనే ఉపాధ్యాయుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రకటించింది. మొదటి నుంచి తనకు కవిత్వంపై గల అభిలాషతో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు పర్యవేక్షణలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి కవిత్వం 'విమర్శ –పరిశీలన'అనే అంశంపై పీహెచ్‌డీ పరిశోధన చేసినట్లు ఆయన తెలిపారు.

ఎస్పీని కలిసిన ఎస్సైలు

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని కురవి, బయ్యారం ఎస్సైలుగా విధుల్లో చేరిన బి.గోపి, జి.ఉపేందర్ ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను శనివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

చర్య తీసుకోవాలి

మరిపెడ రూరల్: మండలంలోని పాంబండతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మేరోని కుంటను ఇటీవల ధ్వంసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ.. విషయంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతులు తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు భూక్య వీరన్న, అజ్మీర కిషన్, భూక్య మేగ్య, పెద్దవీరన్న, రూప పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కేసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. సారమ్మ, ఈశ్వరమ్మ, కలమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కురవి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మరిపెడ డివిజన్ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13న రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వీరేందర్, మహేష్, నవీన్, వినయ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో ఎస్సై పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో సీరోలు ఎస్సైగా బదిలీపై వచ్చిన రమాదేవి కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి జయంతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే జెన్నారెడ్డి జనార్దన్ రెడ్డి జయంతి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అనంతాద్రి గ్రామంలో ఆయన విగ్రహానికి శనివారం కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెన్నారెడ్డి మురళీధర్ రెడ్డి శివశంకర్ రెడ్డి, నాయకుడు మురళీనాయక్, మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్, టీపీసీసీ ఆదివాసీ చైర్మన్ బెల్లయ్యనాయక్ పాల్గొన్నారు.

గంగారం ఎస్సైగా దిలీప్

గంగారం: గంగారం మండలానికి నూతన ఎస్సైగా దిలీప్ బాధ్యతలు శనివారం స్వీకరించారు. అనంతరం పోలీస్ సిబ్బంది బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

గార్ల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలోత్ సురేష్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. సమావేశంలో శివ, తరుణ్, నవీన్, అనీల్, రాధ, హచ్చి, బలరాం, సాల్కి, తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

పెద్దవంగర: చర్చి, ప్రహరీలకు ఎస్‌డీఎఫ్ నిధుల రూ.20లక్షల మంజూరు చేయడాన్ని హర్షిస్తూ శనివారం సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం మండల అధ్యక్షుడు డేవిడ్ రాజ్, పాస్టర్లు జాషువా, పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండలంలోని మన్నెగూడెం వద్ద ఆకేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరైన సందర్భంగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రెడ్యానాయక్ చిత్ర పటానికి మన్నెగూడెం వాసులు శనివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపేందర్, రామకృష్ణ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను రక్షించాలి

కురవి: బాలల హక్కులను రక్షించాలని సఖి కౌన్సిలర్ సరస్వతి, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ షేర్ ఎన్జీఓ కమ్యూనిటీ మొబలైజర్ చిత్తారి సోమన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజర్ మధు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎంవాహిద్, ఎన్జీఓ కౌన్సిలర్ సుమలత పాల్గొన్నారు.

సన్మానం

కేసముద్రం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన అల్లం నాగేశ్వర్‌రావును టీపీసీసీ ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, తెలంగాణ ఆదివాసి చైర్మన్ బెల్లయ్య నాయక్ శనివారం ఘనంగా సన్మానించారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఈనెల 10నుంచి దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్న డిపో మేనేజర్ విజయ్ శనివారం తెలిపారు.

విద్యార్థులకు పలకల పంపిణీ

తొర్రూరు రూరల్: మండలంలోని మడిపెల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం క్లబ్ పూర్వ అధ్యక్షుడు అనుమాండ్ల మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేసి, మొక్కలను నాటారు. కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ తంగళ్లపెల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

బావిలోపడి యువకుడి మృతి

నెల్లికుదురు: ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూతరాజు యాకయ్య(26) రోజు ఇంట్లోని పాడి గేదెలను చెరువు వద్దకు ఉదయం తీసుకెళ్లి ఇంటికి సాయంత్ర అయినా ఇంటికి రాలేదన్నారు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా గ్రామ పొలిమేరలో ఉన్న దేవుని బావి వద్ద యాకయ్య చేతికర్ర, బావిలో చెప్పులు కనిపించినట్లు తెలిపారు. అనుమానంతో పోలీసుల సహాయంతో బావిలో వెతికించగా మృతదేహం లభ్యమైందన్నారు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి ఈత రాకపోవడంతో మునిగి మృతి చెందినట్లు మృతుడి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు

చికిత్స పొందుతున్న వ్యక్తి..

డోర్నకల్: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. డోర్నకల్ ఎస్సై శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బతండాకు చెందిన అజ్మీర లచ్చిరాం(61) ఆర్థిక, ఆరోగ్యపరమైన ఇబ్బందులతో శుక్రవారం ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య సోమ్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స కోసం వెళ్తున్న వ్యక్తి..

నెల్లికుదురు: చికిత్స కోసం వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన మాదరి ప్రసాద్ (38) ఛాతిలో నొప్పిగా ఉందని తన కూతురుతో చెప్పగా, మహబూబాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని తెలిపారు. మృతుడి అన్న సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామ సమీపంలో ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండుకిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసి, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని రూరల్ ఎస్సై రాంచరణ్ శనివారం తెలిపారు. ఒకరు మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు వీరారం తండాకు చెందిన బాదావత్ హుస్సేన్ కాగా, రెండో వ్యక్తి రెడ్యాల గ్రామానికి చెందిన కారపాటి పవన్ గా గుర్తించారు. సదరు వ్యక్తులు భద్రాచలం అవతల గల చింతూరు ప్రాంతం నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి మహబూబాబాద్ ప్రాంతంలో అధిక ధరకు అమ్మేందుకు తీసుకువస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆర్థిక పరిస్థితులు తాళలేక ఆత్మహత్య

నెల్లికుదురు: ఆర్థిక పరిస్థితులు తాళలేక ఓ వ్యక్తి మండల కేంద్రంలోని ఆకేరు బ్రిడ్జి వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామానికి చెందిన అలువాల శంకర్ (32) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. ఆయనకు ఇద్దరు కొడుకులున్నారు. కొంతకాలంగా ఆర్థిక పరిస్థితి బాగలేక కొడుకులను ఎలా ప్రయోజకులను చేయాలో అని బాధపడుతుండే వాడు. ఈనెల 7న ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారిని అడిగినా ఆచూకీ తెలియలేదన్నారు. చిన్నముప్పారం మత్స్యకారులు ఆకేరు బ్రిడ్జి వద్ద నుంచి వెళ్తున్న క్రమంలో మోటార్ సైకిల్, చెప్పులు బ్రిడ్జి వద్ద ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెతికించగా శంకర్ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడి మృతి

మహబూబాబాద్ రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా కొడకండ్ల గ్రామానికి చెందిన కీర్తి రవీందర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఒంటరిగా ఉంటున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి పాఠశాలలో లోపలి నుంచి తలుపులు వేసుకొని నిద్రించారు. శనివారం ఉదయం పాఠశాలకు వచ్చిన హెడ్ మాస్టర్ మమ్మద్ అలీ, విద్యార్థులు రవీందర్ సార్ అంటూ తలుపులు కొట్టి పిలుస్తూ ఎంత లేపినా లేవ లేదు. దీంతో అనుమానం వచ్చి పోలీసులకు, 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించి చూడగా రవీందర్ విగతజీవిగా పడిఉన్నాడు. విద్యార్థులకు రోజు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు అనుమానాస్పదంగా మృతి చెందడంతో కన్నీరు మున్నీరయ్యారు. రవీందర్ గత సంవత్సర కాలం నుంచి ఇదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నా నేటి వరకు వేతనాలు అందలేదని దీంతో ఆందోళనకు గురవుతున్నాడని స్థానికులు తెలిపారు. స్థానికుడు శంతన్ రామరాజు ఇచ్చిన సమాచారం మేరకు బ్లూ కోల్ట్స్ పీసీలు సక్రాం, వీరన్న సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రవీందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తమ్ముడు కీర్తి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ సతీష్ తెలిపారు.



రవీందర్(ఫైల్)